# జూలై 30న మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం

❖ *ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సదస్సును సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి*



**దశ, రంగారెడ్డి:** జిల్లాలో ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు స్థానిక పరిశ్రమల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే లక్ష్యంతో డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్ (DEH) కార్యక్రమం కింద మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని జూలై 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ), కొంగరకలాన్‌లో జరగనుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో MSMEDI, కామర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ శాఖ, APEDA, నాబార్డ్, ECGC, ఇండియా పోస్ట్ తదితర ఎగుమతి ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా ఎగుమతులకు సంబంధించిన ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఎగుమతి విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక సహాయం, ఈకామర్స్ ద్వారా వ్యాపార విస్తరణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అలాగే ఎగుమతులు ప్రారంభించాలనుకునే ఔత్సాహిక వ్యాపారులకు ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ కోడ్ (IEC) పొందే విధానంపై మార్గదర్శకాలు అందించడంతో పాటు, అవసరమైన పత్రాలతో హాజరయ్యే వారికి దరఖాస్తు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, స్టార్టప్ సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (FPOలు), ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువ పారిశ్రామికవేత్తలు, ఎగుమతులపై ఆసక్తి ఉన్న వారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిని కలిసిన నాయకులు



**దశ, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేసి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం..

❖ *ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి*

❖ *పంతంగి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం*



**దశ, చౌటుప్పల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి రైతు వేదికలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీలత , మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు మాట్లాడుతూ మండలంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశమున్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కందులు, మినుములు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు సకాలంలో విత్తనాలు వేసుకుని వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని కోరారు. రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకుని పంటలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంతంగి గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్, రెడ్డిబావి సర్పంచ్ నందగిరి వెంకట్, ఉప సర్పంచ్ బోయ సదానందం, సత్యనారాయణ, ఏపీఎం ఈశ్వర్, ఏఈఓలు వెన్నెల, వీణ కుమారి, లక్ష్మణ్, కృష్ణ, కార్యదర్శి పద్మజతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## బోనాల బందోబస్తుపై అనుమానితులకు పోలీసుల కౌన్సెలింగ్



**దశ ఓయూ:** రాబోయే బోనాల పండుగను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు లాలాగూడ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో 15 మంది అనుమానితుల జాబితా (సస్పెక్ట్ షీట్) హోల్డర్లకు నివారణ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లల్లాగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. రవి కిరణ్ నేతృత్వం వహించారు. ప్రతి అనుమానితుడితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఆయన, పండుగ సందర్భంగా చట్టాన్ని గౌరవిస్తూ మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఎలాంటి చట్టవిరుద్ధ, సంఘ వ్యతిరేక లేదా నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడరాదని హెచ్చరించారు. బోనాల పండుగ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, ప్రజా భద్రతకు భంగం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతియుత వాతావరణంలో బోనాల వేడుకలు నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శ



**దశ, హుజురాబాద్:** ఇటీవల గుండెపోటుకు గురై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి స్వప్న తో పాటు కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ రెడ్డి నాడు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేశారని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన త్వరగానే తిరిగి కోలుకుంటారని మనోధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులతో అన్నారు.




## సీఐ సురేందర్ రెడ్డిని సన్మానించిన బొద్దం శ్రీశైలం యాదవ్

**దశ, రాజేంద్రనగర్ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామంలో ఉన్న శంషాబాద్ పోలీస్ స్టేషన్ నూతన సీఐ సురేందర్ రెడ్డిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం పోలీస్ స్టేషన్లో సిఐ సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా పెద్ద షాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొద్దం శ్రీశైలం యాదవ్, పెద్ద షాపూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులతో కలిసి సిఐని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కేశంపేట చంద్రకాంత్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు రాపాకుల వంశీ, సీనియర్ నాయకులు రాపాకుల ఆంజనేయులు, జిల్లా నరేష్, బొద్దం వినోద్ యాదవ్, ఆవుల శ్యామ్, షేర్ బాయ్ కుమార్, మురళి, ఎర్ర నిఖిల్, రాజు, చాపల రాములు, కుక్కల వెంకటేష్, ఆవుల నారాయణ, బొద్ద మహేందర్ యాదవ్, కేశంపేట శేఖర్ యాదవ్, బైరాగిని వీరేశం, ఆవుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శనివారంలోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి



❖ *ఆగస్టు 3 నాటికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పూర్తి*

**దశ, పెద్ద అంబర్‌పేట:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అర్హులైన ఓటర్లందరూ ఆగస్టు 1 (శనివారం)లోగా తమ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ) తప్పనిసరిగా అందజేయాలని ఈఆర్వో/ఆర్డీవో వై. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 3 నాటికి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తికానున్నందున ప్రజలు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని కోరారు. చివరి క్షణంలో దరఖాస్తులు సమర్పిస్తే తప్పులు జరిగే అవకాశం ఉంటుందని, నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు ఫారాలు అందించాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అర్హులైన ఏ ఒక్క పౌరుడు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు పెద్ద అంబర్‌పేట, కుంట్లూరు డివిజన్ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని ఓటర్లందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఏఈఆర్వో/ఏఎంసీ బి. కిరణ్ కుమార్ కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి. రమేష్, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వ్యాపారస్తులు వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధి లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 60 ఫీట్ రోడ్డు పాత స్నేహ చికెన్ సెంటర్ బిల్డింగ్ ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్ షాపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణం వ్యాపార రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, స్థానికంగా నాణ్యమైన ఉత్పత్తులు అందించే సంస్థలకు ప్రజలు మంచి ఆదరణ కల్పిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ వుడెన్ ఫర్నిచర్‌లో సొంత తయారీతో ఇంటికి అవసరమైన అన్ని రకాల వుడెన్ ఫర్నిచర్ అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్లకుండానే ఆధునిక డిజైన్లలో నాణ్యమైన ఫర్నిచర్‌ను సూర్యాపేటలోనే పొందే అవకాశం కల్పించడం వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ



కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, చినుముల సునీల్ రెడ్డి, జహీర్, స్థానిక కౌన్సిలర్ తాహిర్, నాయకులు అబ్దుల్ రహీం, గుణగంటి సతీష్, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, ఫరూక్, ఆలేటి మాణిక్యం, దారపునేని శ్రీనివాస్ రావు, వల్లెం శేఖర్, రేపాల శ్రీనివాస్, వెంకట కృష్ణారావు, శ్రీనివాస్ రెడ్డి, నిర్వాహకులు వేమూరి సింధు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో కలిసిన ప్రతి నీటి చుక్క... హుజురాబాద్ రైతు కళ్లలో కన్నీటి చుక్కగా మారింది

❖ *ఇది ప్రకృతి కరువు కాదు... కాంగ్రెస్ తెచ్చిన కరవు: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి*



**దశ, హుజురాబాద్:** ముఖ్యమంత్రి మీరు కన్నేపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి ఉంటే, ఆ నీరు అన్నారం బ్యారేజ్, సుందిళ్ల, ఎల్లంపల్లి, నందిమేడారం, మిడ్ మానేరు మీదుగా ఎస్ఆర్ఎస్పీకి, అలాగే మల్లన్నసాగర్‌కు చేరే అవకాశం ఉండేది. కానీ లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిపోవడంతో మా ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది ప్రకృతి తీసుకొచ్చిన కరువు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు అని అన్నారు. నేను ప్రస్తుతం హుజురాబాద్ నియోజకవర్గంలోని సిర్సపల్లి గ్రామంలో ఉన్నాను. ఇక్కడ వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. కానీ నీటి కొరత కారణంగా పొలాలు బీడుగా మారాయి. రైతులు నాట్లు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాదు, నీటి కోసం బావులను క్రేన్ వాడే పరిస్థితి కి వచ్చింది బావుల్లో నీరు లేదు. ఈ పరిస్థితి రైతుల దుస్థితిని స్పష్టంగా తెలియజేస్తోంది. కాబట్టి హుజురాబాద్ నియోజకవర్గ రైతుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరుతున్నాను. దయచేసి కన్నేపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి మా ప్రాంతానికి సాగునీరు అందించండి. మా రైతాంగాన్ని ఆదుకుని, పంటలను కాపాడండి.

## ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారు

❖ *బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి*

❖ *ఎమ్మెల్యే వైఖరి మోసపూరితమని మండిపాటు*



**దశ, రంగారెడ్డి :** అబద్ధాలు , ఉత్తుత్తి సమావేశాలతో ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ఫార్మాసిటీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫార్మా రైతుల సమావేశానికి సంబంధిత రైతులను , ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులను పిలవకుండా మరోసారి మోసం చేశారని చెప్పారు. తూతూమంత్రపు సమావేశాలతో రైతులకు ఒరిగిందేమీ లేదని , హామీల అమలుకు నిర్దుష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు తిరిగి భూములు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని ఆయన ఎమ్మెల్యే కు సూచించారు. రైతుల అంగీకారం లేకుండా ఆన్ లైన్ లో వారి పేర్లు తొలగించిన 2500 ఎకరాల భూములను వెంటనే రైతుల పేరిట నమోదు చేయాలని కోరారు. మేడిపల్లి , నానక్ నగర్ , తాడిపర్తి , కుర్మిద్ద గ్రామాలకు కిలోమీటరు దూరం వరకు ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. భూములు రైతులకు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తే రైతులు తిరగబడతారని ఆయన హెచ్చరించారు. రైతులకు బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయించలేకపోవడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసమర్థతకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌పై ప్రత్యేక దృష్టి

- ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- పోలింగ్ కేంద్రాల్లో 1,200 మందికి మించి ఓటర్లు ఉండొద్దని ఆదేశం




**దశ, రంగారెడ్డి :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులతో (ఈఆర్‌వోలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా సవరణ పనుల పురోగతిని సమీక్షించారు.

అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ ప్రక్రియలను పూర్తిగా నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. బీఎల్‌వో సూపర్వైజర్లు, ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు డిజిటైజేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా హేతుబద్ధీకరణ చేపట్టాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ వీలైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహించి వాటి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

అలాగే ఎఎస్‌డీ జాబితా సిద్ధం చేసిన తర్వాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తాజా మ్యాపింగ్ డేటా ఆధారంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్యను సమతుల్యం చేస్తూ, ఒకే కాలనీ లేదా నివాస సముదాయానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### ఫారం-8 ద్వారా సమస్యల పరిష్కారం

కొన్ని ప్రాంతాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదైన సమస్యలు ఉన్నాయని, ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన తర్వాత ఫారం 8 ద్వారా వాటిని సవరించేలా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలతో అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తూ పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లెక్చరర్ కామెంట్స్ విద్యార్థి ఆత్మహత్య



**దశ, మహబూబ్ నగర్:** తడు చదువుల్లో టాపర్. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్కోర్ చేసిన విద్యార్థికి ఇంటర్ ఫస్టియర్‌లో జిల్లాలో రెండో ర్యాంక్ వచ్చింది. కానీ లెక్చరర్ చేసిన తీవ్ర అవమానాన్ని తట్టుకోలేక ఓ టాలెంట్ ఉన్న ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన నేతిబొట్టు తరుణ్ (17) అనే విద్యార్థి గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బైపీసీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటుకున్నాడు.ఈ క్రమంలో కాలేజీలో ఓ మహిళా లెక్చరర్ 435 మార్కులు సాధించగా.. మరొక విద్యార్థితో తరుణ్‌ను పోలుస్తూ, '434 మార్కులు వస్తే నువ్వేమన్నా గొప్పోడివా? నీకంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారు కూడా ఉన్నారంటూ' మిగతా విద్యార్థుల ముందే కించపరిచింది. అలా అందరి ముందు నిరుత్సాహపరచడం, అవమానించడం కరెక్ట్ కాదని తరుణ్ ఆమెకు విజ్ఞప్తి చేశాడు.దాంతో విచక్షణ కోల్పోయిన ఆ లెక్చరర్.. "నువ్వేమైనా మంత్రి కొడుకువా? అంతకంటే గొప్పోడివా?" అంటూ తరుణ్ చెంపపై కొట్టి తీవ్రంగా అవమానించినట్లు ఆరోపణలు ఉన్నాయి.లెక్చరర్ ప్రవర్తనకు తోటి విద్యార్థులందరూ నవ్వడంతో తరుణ్ తీవ్ర ఆవేదనకు, మనోవేదనకు గురయ్యాడు. 2 రోజుల పాటు తీవ్రంగా కలత చెందిన తరుణ్ మంగళవారం నాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టీచర్లు, లెక్చరర్లు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉండాలి తప్ప ఇలా అవమానించకూడదని, సున్నిత స్వభావం ఉన్న ఉన్న వారికి అవమానం జరిగితే ఎంత బాధపడతాడో ఆ లెక్చరర్‌కు తెలియాలని తన సూసైడ్ నోట్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయం ప్రజలందరికీ తెలియాలనే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

# రాష్ట్రం,హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి: వొడితల ప్రణవ్

- కొండగట్టులో ఘనంగా గిరిప్రదక్షిణ..
- వర్షాలు సమృద్ధిగా కురవాలని,కొండగట్టు అంజన్నను మొక్కుకున్న ప్రణవ్..
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాగిన గిరిప్రదక్షణ..



**దశ, హుజురాబాద్:** నియోజవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కొండగట్టు అంజన్నను వేడుకున్నారు.బుధవారం రోజున కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండగట్టు గిరిప్రదక్షణలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్,మున్నూరు కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు బొమ్మ శ్రీరామ్ హాజరయ్యారు.వర్షం సైతం లెక్కచేయకుండా,గిరి ప్రదక్షణ రోజే భారీవర్షం పడడంతో భక్తులు,కార్యకర్తలు ఆంజనేయ స్వామి అనుగ్రహం కలిగిందని,ఆ స్వామి నామస్మరణతో ప్రదక్షణ పూర్తిచేశారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అంజన్న అనుగ్రహం ప్రజలందరిపై,రైతులపై ఉండి,రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,పాడి పంటలతో హుజురాబాద్ నియోజకవర్గం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నీ నో పై వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే కౌశిక్ రెడ్డి మాత్రం కరువు కాంగ్రెస్ తెచ్చిందని మాట్లాడడం కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని,తానే శాస్త్రవేత్తలాగా మాట్లాడడం సిగ్గు చేటని,ప్రజలను ఇబ్బంది పెట్టేపనుల్లో బిఆర్ఎస్ నాయకులు మొదట ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒప్పందం పేరుతో సీడ్ పత్తి రైతులకు టోకరా..

- బకాయిల కోసం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



**దశ, సి.బెళగల్:** అధిక ఆదాయం వస్తుందనే ఆశతో ఒప్పంద పద్ధతిలో సీడ్ పత్తి సాగు చేసిన రైతులు దళారి (ఆర్గనైజర్) చేతిలో మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ పేరుతో రైతుల నుంచి సీడ్ పత్తి విత్తనాలు సేకరించిన తర్వాత చెల్లించాల్సిన లక్షల రూపాయల బకాయిలు ఇవ్వకుండా నిర్వాహకుడు చేతులెత్తేయడంతో బాధితులు సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. డబ్బులు అడిగితే "నీకు దిక్కున్న చోట చెప్పుకో" అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని తిమ్మందొడ్డి గ్రామ రైతులు హైదరాబాద్‌కు చెందిన సూపర్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని సీడ్ పత్తి సాగు చేపట్టారు. కంపెనీ తరఫున మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తూ విత్తనాల పంపిణీ, సాగు సూచనలు, పంట సేకరణ బాధ్యతలు నిర్వహించినట్లు రైతులు తెలిపారు. ఒప్పందం ప్రకారం సీడ్ పత్తి విత్తనాలను క్వింటాలుకు రూ.45 వేల చొప్పున కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసి భారీ పెట్టుబడులతో సాగు చేపట్టారు. అయితే పంటను కంపెనీకి అప్పగించిన తర్వాత చెల్లింపులు చేయకుండా ఆర్గనైజర్ కాలయాపన చేశాడని, అనంతరం ఫోన్ కాల్స్‌కు కూడా స్పందించడం మానేశాడని బాధితులు వాపోయారు. తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన రైతు కొండగల లక్ష్మన్న తన 75 సెంట్ల భూమిలో సుమారు రూ.2 లక్షల పెట్టుబడితో సీడ్ పత్తి సాగు చేసి, లాట్ నంబర్-6318 కింద నాలుగు క్వింటాళ్ల విత్తనాలను కంపెనీకి అప్పగించినట్లు తెలిపారు. కానీ ఇప్పటికీ రావాల్సిన డబ్బులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మన్నతో పాటు గ్రామానికి చెందిన ముని, పెద్ద రామలింగం, పెద్ద లక్ష్మణ్ సహా 20 మందికి పైగా రైతులు ఇదే విధంగా సీడ్ పత్తి సాగు చేసి కంపెనీకి పంట అందజేసినట్లు తెలిపారు. వారిలో చాలామందికి పూర్తి చెల్లింపులు అందకపోగా, కొందరికి అసలు డబ్బులే రాలేదని పేర్కొన్నారు. పంట కోసం చేసిన అప్పులు తీర్చలేక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని చెబుతూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బకాయిలు ఇప్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ పోలీసులను కోరారు.

# తెలంగాణ సాహిత్య సాంస్కృతిక సంపదను పరిరక్షించుకోవాలి: ప్రొఫెసర్ సంపత్ కుమార్ రెడ్డి

- హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ రోజు కార్యశాల విజయవంతం




**దశ, హుజురాబాద్:** శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం 100 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజురాబాద్ మరియు శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సృజనాత్మక రచన & స్క్రిప్ట్ రచనా నైపుణ్యాలు" అనే రెండు రోజుల కార్యశాల రెండవ రోజు బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట తెలుగు అధ్యాపకులు ప్రొఫెసర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్యం, భాష, సంస్కృతి, జానపద సంపదలు మన సమాజానికి అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలోనూ ఈ సంపదను సంరక్షించి, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా యువత తెలంగాణ జానపద సంపద, స్థానిక భాషా వైవిధ్యం, సాహిత్య సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాల,నిర్మల్ అధ్యాపకులు డా. బట్టు విజయ్ కుమార్ "తెలుగులో ఆధునిక సాహిత్య రూపాలు – సృజనాత్మక వికాసం" అనే అంశంపై ప్రసంగించారు. మినీ కవిత, హైకూ, నానీలు, రుబాయి, గజల్ వంటి ఆధునిక కవితా రూపాల స్వరూపం, నిర్మాణం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ అంశాలను వివరించారు. సమకాలీన భావాలను సంక్షిప్తంగా, ప్రభావవంతంగా వ్యక్తీకరించడానికి ఈ సాహిత్య రూపాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మరో వక్త మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం అధ్యాపకురాలు కొండా ప్రవళిక "జానపద గేయాల సేకరణ – డాక్యుమెంటేషన్ విధానాలు మరియు ఆవశ్యకత" అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.ఇందిరా దేవి, కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డా. కె. లింగారెడ్డి, ఐ.క్యు.ఎ.సి. కోఆర్డినేటర్ డా. బి. రేణుక, అధ్యాపకులు డా. వి. స్వరుపా రాణి, డా. సరళ ఝాన్సి, పల్లవి, ఓదెలు, రమ, సుమలత, నరెందర్, మహిపాల్ రెడ్డి, స్వప్న, విద్యార్థినీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం




**దశ, న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషా-సాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.

# SIR ప్రక్రియలో వేగం పెంచాలని బీజేపీ నేతల పిలుపు



**దశ ఓయూ:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న SIR మండల ప్రవాస్ అభియాన్ 24 గంటల పర్యటనలో భాగంగా నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలి రోజు డివిజన్ సంయోజకులు (ఇంచార్జి కోఆర్డినేటర్), మెడ్చల్ అర్బన్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, ఉప్పల్ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకుడు మోర నర్సింహా రెడ్డి నివాసంలో శక్తికేంద్ర ఇంచార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై సమీక్ష చేపట్టారు. అనంతరం హెచ్ఎంటీ నగర్‌లోని శక్తికేంద్ర ఇంచార్జ్‌లతో సమావేశమై SIR ఫారాల పంపిణీ, స్వీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పరివార్ సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై ఓటరు నమోదు కార్యక్రమంపై చర్చించారు. రాఘవేంద్ర నగర్‌లో బీజేపీ ఉప్పల్ నియోజకవర్గం BLA1 పోతగాని గోపాల్ గౌడ్ ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి ఓటర్లతో మాట్లాడారు. అనంతరం బీఎల్‌వోలతో కలిసి SIR ప్రక్రియ అమలు తీరును పరిశీలించి, ఇప్పటివరకు పంపిణీ చేసిన, స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాలు తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చివరి ఐదు రోజులు యుద్ధప్రాతిపదికన పనిచేసి ప్రతి అర్హ ఓటరును నమోదు చేసేలా కృషి చేయాలని BLA2లు, బీజేపీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉప్పల్ నియోజకవర్గం BLA1 పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొల్లం చంద్రమౌళి, మోర నర్సింహా రెడ్డి, రాజిరెడ్డి, గందమల్ల గోపి, డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, ఉదయ్, కాటిపల్లి రవీందర్ రెడ్డి, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, చిల్లా అశోక్, శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ, కిరణ్ కుమార్, నర్సింగ్, కృష్ణ, శేఖర్, అనిత రెడ్డి, మంజుల, కళావతి, వరలక్ష్మి, శక్తికేంద్ర ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి చదువులో రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లాను విద్యారంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 202526 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రచేష్టలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు. ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18వ వార్డు సాయిబాబా మందిరంలో ఇండస్ట్రియల్ ఏరియాలో మాజీ కౌన్సిలర్ మాలోతు కమల చంద్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పర్వదినమని అన్నారు. సాయిబాబా బోధించిన శ్రద్ధ, సబూరి, సేవాభావం ప్రతిఒక్కరి జీవితానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. సాయిబాబా కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జయ స్కూల్ కరస్పాండెంట్ వేణుగోపాల్, నిమ్మల వెంకన్న, నిఖిల్, రమేష్ నాయుడు, శంకర్ నాయక్, వంశీ, శ్రీను, శకుంతల, తులసి, లక్ష్మమ్మ, మౌనిక, చారి, మన్సూర్ రెడ్డి కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.